క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థిని కరాటే కటా విభాగంలో గెలుపొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టరు కె.కిషోర్ తెలిపారు. ఈ నెల 17న రాష్ట్రస్థాయిలో విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ కరాటే జూడో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో 14 సంవత్సరాల కటా విభాగంలో పి.యోక్షిత అత్యుత్తమ ప్రతిభ కనపరచి ద్వితీయ బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. విజేతను, కోచ్ వెంకటేశ్వరరావును పాఠశాల డైరెక్టర్ కిషోర్, హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. యోక్షితను తోటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే నివాళి



కోడూరు: మండలంలోని ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రేపల్లె సత్యన్నారాయణ సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశాడు. సత్యన్నారాయణ మృతివార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కోడూరులో మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. పార్టీ ఉన్నతికి ఆయన చేసిన సేవలను స్మరించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి సత్యన్నారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, నేతలు కోట పద్మావతి వరప్రసాద్, మలే నరేష్, పలువురు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సబ్జెక్టులపై అవగాహన అవసరం

కోనేరుసెంటర్: విద్యార్థులు పరిశోధనలపై ప్రావీణ్యం పొందాలంటే సబ్జెక్టులపై అవగాహనతో పాటు మంచి నైపుణ్యం కలిగి ఉండాలని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్.నాగరాజు తెలిపారు. సోమవారం కృష్ణా విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన రసాయనశాస్త్రంలో అతిథోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఫార్మారంగాల వైపు మెండుగా ఉన్నాయన్నారు. ఉన్నత విద్య ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.రామశేఖర్‌రెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ బసవేశ్వరరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వీరబ్రహ్మచారి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

టాయిలెట్లను వినియోగంలోకి తేవాలి

మోపిదేవి: స్థానిక ప్రధాన రహదారి పక్కన పంచాయతీ అధికారులు నూతనంగా నిర్మించిన టాయిలెట్లను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని మీకోసంలో ఈవోపీఆర్డీకి త్రిపుర సుందరికి జనసేన పార్టీ నాయకులు కోసూరు రామాంజనేయులు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మీకోసం కార్యక్రమం జరిగింది. గ్రామంలో శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి విచ్చేసే భక్తులకు టాయిలెట్లు ఎంతగానో ఉపయోగపడతాయని, వెంటనే వీటిని వినియోగంలోకి తీసుకురావాలని వినతిపత్రంలో కోరారు. పలు సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరించారు.

జాబ్‌మేళాకు 34 మంది హాజరు



పెడన: పెడన బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. మూడు కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొనగా పెడన పరిసర ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు 34 మంది హాజరయ్యారు. వీరికి ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఏడుగురిని ఎంపిక చేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సాయిదా ఆయాన్, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది రాజేష్, వంగబాబు తదితరులు పాల్గొన్నారు.

తీరం వెంట సాగునీటికి తంటా!

- తీర ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి
- కొన్నిచోట్ల నెర్రెకొడుతున్న పొలాలు
- మరికొన్ని చోట్ల చిరుపొట్ట దశలో వరిపైరు
- చివరి దశలో సాగునీరందక తీవ్ర ఇబ్బందులు



పిట్టల్లంకలో ఈనే దశలో వరిపొలాలు



ఉల్లిపాలెంలో నీరందక ఎండిపోతున్న, రెండోసారి నాట్లు వేసిన వరిపంట

అవనిగడ్డ: దివిసీమలోని తీర ప్రాంతాలకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిరుపొట్ట, వరి ఈనే దశలో సాగునీరందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటకాలువల్లో పూడిక తీయక పోవడం, షట్టర్లు లేకపోవడం, దెబ్బతినడం వల్ల సాగునీటి ఎద్దడి ఎదుర్కోవాల్సి వస్తోందని తీర ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నాడు ముంపు.. నేడు సాగునీటికి కటకట..

అవనిగడ్డ నియోజకవర్గంలో ఆరు మండలాల్లో ఈ ఏడాది 98,645 ఎకరాల్లో వరిసాగు చేశారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల్లో వరి పొలాలు కోతదశకు చేరుకున్నాయి. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో వరి ఈనెక, చిరుపొట్ట, పాలుపోసుకునే దశలో ఉన్నాయి. ఈ సమయంలో వరిపంటకు పూర్తిగా నీరుండాలి. లేదంటే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయని రైతులు చెప్పారు.

ఈ దశలో నీరందకపోతే..

ఈ ప్రాంతాల్లో ప్రస్తుతం వరిపంట పాలుపోసుకునే దశ, ఈనెక, చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలో వరిపంటకు సాగునీందక పోతే గింజసరిగా పాలుపోసుకోక పోవడం, తాలు గింజలు ఏర్పడటం, కంకులు సరిగా రాక దిగుబడులు తగ్గిపోతాయని ఈ ప్రాంత రైతులు చెప్పారు.

పెరుగుతున్న ఖర్చులు..

కోడూరు, నాగాయలంక దిగువ గ్రామాలకు సరిగా సాగునీరందక పోవడంతో రైతులు ఇంజిన్ల సహాయంతో నీరు తోడుకుంటున్నారు. ఒక్కో తడుపునకు ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.3 వేలు ఖర్చు అవుతుందని పిట్టల్లంకకు చెందిన రైతులు చెప్పారు.

నీరు సక్రమంగా అందకపోతే ఎకరాకు ఐదారు బస్తాలు దిగుబడి తగ్గుతుంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధికారుల వైఫల్యం వల్లే..



కాలువలకు పూడిక తీయక పోవడం, రెగ్యులేటర్లకు షట్టర్లు లేకపోవడం, షట్టర్లు దెబ్బతినడం వల్లనే సాగునీటి ఎద్దడి వచ్చింది. భావదేవరపల్లి కాలువ కింద మా పొలాలు ముంపు భారిన పడి రెండు సార్లు ఊడ్చించాను. ఇప్పుడు సాగునీరందక ఎండిపోతున్నాయి. వారంరోజుల కిందట మురుగు కాలువ నుంచి ఇంజిన్లు పెట్టి నీరు తోడాను. లేదంటే పంట ఎండిపోయేది. అధికారుల వైఫల్యం వల్లనే ఈ దుస్థితి.

– టీసాబత్తిన ప్రసాద్, డీసీ మాజీ చైర్మన్, నాగాయలంక

కాలువలు సక్రమంగా లేక..



పిట్టల్లంక వాటర్ ట్యాంకు వద్ద ఆయిల్ ఇంజిన్లతో నీరు పెట్టుకుంటున్న రైతులు

నెలరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఈ మండలాల్లో దిగువ ప్రాంత పొలాలు ముంపునకు గురై దెబ్బతిన్నాయి. నేడు అవే పొలాలు సాగునీరందక ఎండిపోతున్నాయి. పంటకాలువలకు పూడిక తీయక పోవడం, రెగ్యులేటర్లకు షట్టర్లు లేకపోవడం, కొన్నిచోట్ల దెబ్బతినడం వల్ల దిగువ ప్రాంతాలకు సరిగా సాగునీరు వెళ్లడం లేదు. నాగాయలంక మండలం భావదేవరపల్లికి వెళ్లే రెండో నంబర్ కాలువకు షట్టర్లు దెబ్బతిన్నా పట్టించుకోలేదు. దీంతో ఈ కాలువ కింద సాగునీరు వృథాగా పోవడం, కాలువలకు అడ్డుకట్టలు వేసుకుని నీరు పెట్టుకోవడం వల్ల దిగువ ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భావదేవరపల్లి, కమ్మనమోల, బోడవరం, నాలి, సొర్లగొంది. గుల్లలమోద, కోడూరు మండలం ఉల్లిపాలెం, వేణుగోపాలపురం, సాలెంపాలెం, ఉపకాలి, పిట్టల్లంక గ్రామాల్లో గతంలో ముంపునకు గురైన పొలాలు దెబ్బతిన్నాయి. ఈ గ్రామాల్లో కొంతమంది రైతులు రెండు సార్లు నాట్లు వేశారు. నేడు అవే ప్రాంతాల్లో సాగునీరందకపోవడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఐ రంగనాథ్ సేవలు ప్రశంసనీయం



కోనేరుసెంటర్: జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కి రంగనాథ్ అందించిన సేవలు ప్రశంసనీయమని కృష్ణా జిల్లా స్పెషల్ బ్రాంచ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. కృష్ణా జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా పని చేస్తూ ఏపీ ట్రాన్స్‌కోకు బదిలీపై వెళ్తున్న ఎంపీఎస్ఎస్ రంగనాథ్‌ను సోమవారం జిల్లా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసుశాఖలో బదిలీలు అనేవి సర్వసాధారణమని స్పెషల్ బ్రాంచ్ శాఖకు సీఐగా ఉత్తమ సేవలను అందించిన రంగనాథ్ ఏపీ ట్రాన్స్‌కోలోనూ అదే పేరును పొందుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

ఘంటసాల: మండలంలో మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డి.సుబ్బారావు తెలిపారు. 19, 20వ తేదీల్లో ఘంటసాల జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఘంటసాల, ఘంటసాలపాలెం, కొత్తపల్లి, తాడేపల్లి, దేవరకోట, మల్లంపల్లి, చిలకలపూడి, వి.రుద్రవరం గ్రామాల వారికి, 21, 22 తేదీల్లో శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, అచ్చెంపాలెం, చినకళ్లేపల్లి, వేములపల్లి, కొడాలి, పాపవినాశనం, గోగినేనిపాలెం గ్రామాల వారికి ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సుబ్బారావు కోరారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు



పెడన ఆగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



నాగాయలంకలో పారిజాత పుష్పాలతో పరిమళించిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి



నాగాయలంక శ్రీరామపాదక్షేత్ర వద్ద కృష్ణానదిలో పుణ్య స్నానాలు

పెడన: పట్టణంలో శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం, మండల వ్యాప్తంగా పలు శైవక్షేత్రాలలో కార్తిక మాసం మూడో సోమవారం శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు వేకువజామునే దేవాలయాలకు చేరుకుని ధ్వజస్తంభాల వద్ద గణనాథుని సన్నిధిలో దీపారాధన చేశారు. కొందరు ఆలయం వెనుక ఆవరణలో 365 వత్తులతో దీపాలను వెలిగించారు. మరికొందరు విఘ్నేశ్వరపూజ అనంతరం శివునికి అభిషేకాలు చేయించారు. రాత్రి 9 గంటల వరకు స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

భావదేవరపల్లి(నాగాయలంక): కార్తిక సోమవారం పర్వదినం పురస్కరించుకుని స్థానిక శ్రీఅన్నపూర్ణ సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామిని అన్నంతో సుందరంగా అభిషిక్తుడిని చేశారు. ఆలయ ధర్మకర్త పూషడపు నిరంజనరావు ఆధ్వర్యంలో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో అన్నమాభిషేకంతో అలంకరించారు. నాగాయలంకలో శ్రీవల్లీ దేవసేన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి అంబా సాయికిరణ్ శర్మ అభిషేకాలు జరిపారు. శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమనిత్వత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీనగరేశ్వరుడిని పలు ద్రవ్యాలతో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు అభిషేకించారు. కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు తదితర ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.

నాగాయలంక: కార్తిక మాసోత్సవాల్లో మూడో సోమవారం స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ వద్ద కృష్ణానదిలో తెల్లవారుజాము ఐదు గంటల నుంచి భక్తులు, అయ్యప్ప దీక్షాపరులు తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు చేశారు. నదిలోని మండపంలో శ్రీరామలింగేశ్వర శివలింగానికి భక్తులు అభిషేకాలు చేసుకున్నారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తదితర గ్రామ ప్రముఖులు మండపంలో అభిషేక పూజలు జరిపారు. ఒడ్డున కార్తిక వత్తులు వెలిగించి పూజలు చేసుకున్నారు.

రూ.2.75 కోట్లతో భవన నిర్మాణం

షాపింగ్ కాంప్లెక్స్, భక్తులకు 20 గదులు



షాపింగ్ కాంప్లెక్స్ పనులకు మార్కింగ్ వేయిస్తున్న డీఈ గోపాలకృష్ణరాజు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పార్కింగ్ ప్రదేశంలో రూ. 2.75 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్, భక్తుల సౌకర్యార్థం గదుల నిర్మాణ పనులను ఈ నెల 20వ తేదీ బుధవారం ప్రారంభించనున్నట్లు ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. సోమవారం కట్టడాలకు సంబంధించిన స్థలంలో దేవదాయశాఖ డీఈ దండు గోపాలకృష్ణరాజు మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ దేవస్థానం నిధులతో నిర్మించబోయే నూతన భవనంలో గ్రౌండ్ ఫ్లోర్లో 10 షాపులు, భక్తుల సౌకర్యార్థం 20 గదులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మొదటి, రెండు అంతస్తులకు లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తామని, సంవత్సరంలోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించామని చెప్పారు. నంద్యాలకు చెందిన ఎస్ఎస్ దస్తగిరి కన్‌స్ట్రక్షన్స్ సంస్థ భవన నిర్మాణపు పనుల కాంట్రాక్టు దక్కించుకున్నట్లు వివరించారు. డీసీ వరప్రసాదరావు మాట్లాడుతూ బుధవారం భవన నిర్మాణ పనులను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించనున్నట్లు తెలియజేశారు.

యాంటీబయాటిక్స్‌తో మానవాళికి ముప్పు

నాక్సా రాష్ట్ర ఆర్‌సీఓ చంద్రశేఖర్



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌సీఓ చంద్రశేఖర్

కోడూరు: విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వినియోగించడం వల్ల భవిష్యత్‌లో మానవాళి మనుగడకే ముప్పు ఏర్పడుతుందని నాక్సా రాష్ట్ర ఆర్‌సీఓ ఎస్పీ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో నాక్సా ఆధ్వర్యంలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. అతిగా యాంటీబయాటిక్స్ వాడటం వల్ల మనవాళికి మేలు చేసే మైక్రోబ్స్ నాశనమవుతాయని, దీంతో ఏఎంఆర్ వృద్ధి చెంది తీవ్ర ప్రభావం చూపతుందని చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఏఎంఆర్ కారణంగా ప్రతి ఏటా మరణాల సంఖ్య పెరుగుతుందని, ఆహార ఉత్పత్తులను పెంచుకోవడానికి వాణిజ్య, జంతు, వ్యవసాయ ఉత్పత్తుల్లో యాంటీబయోటిక్స్ వాడకం పెరగడమే దీనికి కారణమన్నారు. ప్రస్తుతం ఏఎంఆర్ మానవ ఆరోగ్యానికి, ఆహార భద్రతకు సుస్థిర అభివృద్ధికి సైతం ముప్పుగా మారిందని, వీటి వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని చంద్రశేఖర్ సూచించారు. ఎంపెడా జీటీఓ కే అయ్యన్ మాట్లాడుతూ మైక్రోబ్స్ కేవలం మేలు చేయడమే కాకుండా కొన్ని సందర్భాల్లో మానవులతో పాటు జంతువులు, మొక్కలకు హాని కలిగిస్తాయన్నారు. మైక్రోబియల్ టీకాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారని, ఈ టీకాలు ప్రమాదకరమైన మైక్రోబ్స్‌ను అంతం చేస్తాయని చెప్పారు. అందరూ ఏఎంఆర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫిషరీస్ ఏడీ ఆర్.ప్రతిభ, కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ సీహెచ్.సురేష్‌బాబు, టెక్నికల్ సీఏఏ ఎం.రామప్రసాద్, ఫీల్డ్ మేనేజర్ బి.రవికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



పెడన గ్రంథాలయంలో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు



గూడూరులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోతన రామోజీ

పెడన: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి బసవేశ్వరరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మోపిదేవి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం మోపిదేవి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్, క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన, తాడు ఆటలు వంటి వాటిపై పోటీలు నిర్వహించారు. బొందలపాటి సుబ్బారావు, కంఠంనేని కుటుంబరావు, కావూరి కోదండరామయ్య, గ్రంథాలయ అధికారి కె.సుధీర్ కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గూడూరు: విద్యార్థులు తరచూ గ్రంథాలయాలను సందర్శించాలని గూడూరు మాజీ సర్పంచి పోతన రామోజీ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం గూడూరు శాఖా గ్రంథాలయంలో రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై.శ్రీనివాసరావు, టీడీసీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘంటసాల: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఘంటసాల, కొడాలి గ్రంథాలయాల అధికారులు శరత్, సుబ్బారావుల ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఘంటసాల, కొడాలి జెడ్పీ హైస్కూల్లోని విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించి వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు.



కొడాలి హైస్కూల్లో క్విజ్ పోటీలను పర్యవేక్షిస్తున్న లైబ్రేరియన్ సుబ్బారావు



మోపిదేవి జెడ్పీ పాఠశాలలో ఆటల పోటీల్లో విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు 216 జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు కాగా 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం నుంచి ద్విచక్ర వాహనంపై అవనిగడ్డ మండలం వలందపాలెం గ్రామానికి చెందిన ఎ.కనకదుర్గ, కుమారుడు నాగమల్లేశ్వరావు గ్రామానికి వస్తుండగా మార్గ మధ్యలో జాతీయ రహదారిపై పెదప్రోలు క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యాపారులకు పారిశుద్ధ్యంపై అవగాహన

కోడూరు: మండల కేంద్రంలోని వ్యాపారులకు కోడూరు పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో కూరగాయలు, హోటల్ నిర్వాహకులు, బార్బర్, చిరువ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో చెత్తకుండీలను ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి శేషగిరిరావు చెప్పారు. చెత్తాచెదారాన్ని డస్ట్‌బిన్లలో వేసి, రోడ్ల పక్కన పెడితే పారిశుద్ధ్య కార్మికులు వాటిని తీస్తారన్నారు. రహదారుల వెంట చెత్తాచెదారం వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. వార్డ్ సభ్యుడు వెన్నా ప్రసాద్, సచివాలయ కార్యదర్శి శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర తీరంలో మెరైన్ పోలీసుల గస్తీ



కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ప్రత్యేక గస్తీ నిర్వహించారు. కార్తిక సోమవారం కావడంతో దూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు తీరానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. బీచ్ వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. కుటుంబ సమేతంగా తీరంలో సహపంక్తి భోజనాలు చేశారు. యువకులు వివిధ రకాల ఆటలాడుతూ సరదాగా గడిపారు. సముద్ర స్థితి గతులపై మెరైన్ పోలీసులు అవగాహన కల్పించారు. సముద్రం లోపలకు వెళ్లి స్నానాలు చేయవద్దంటూ మైక్‌ల ద్వారా హెచ్చరించారు. సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ జిలానీ, రైటర్ రెహ్మాన్ పాల్గొన్నారు.

గ్రామ సభల్లో ఉపాధి పనులకు ఆమోదం

కృత్తివెన్ను: మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకంలో చేయదగిన పనులను గుర్తించి ఆమోదం కొరకు గ్రామ సభలను సోమవారం నిర్వహించారు. ఈ పథకం ద్వారా అన్ని పంచాయతీలలో పనులు జరపనున్నట్లు ఏపీఓ పసుపులేటి సైదారావు తెలిపారు. ఇంతేరు చినపాండ్రాక, చెరుకుమిల్లి, ఎండపల్లి, మునిపెడ, నీలిపూడి పంచాయతీలో సభలను నిర్వహించారు. పంచాయతీల పరిధిలో రాబోవు రోజుల్లో ఉపాధి పథకం ద్వారా పనులు జరగనున్నాయని, వీటిని ముందుగా గుర్తించి గ్రామ సభ ద్వారా ఆమోదం పొందుతు న్నామన్నారు. ఈ సభలలో ఆయా పంచాయతీల సర్పంచులు ఉపాధి హామీ ఈసీ నాగ సురేష్, టీఏలు కిషోర్, కల్యాణ్, ఎఫ్ఏలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



దేవరపల్లిని కలిసిన వాచ్‌మెన్‌లు, ఆయాలు, పారిశుద్ధ్య కార్మికులు

చల్లపల్లి(ఘంటసాల): రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లకు వెంటనే వేతనాలు వేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. చల్లపల్లి, మోపిదేవి మండలాలకు చెందిన కొంతమంది వాచ్‌మెన్‌లు, ఆయాలు సోమవారం దేవరపల్లిని కలసి తమ ఇబ్బందులు చెప్పుకున్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్ళి వేతనాలు ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయాలు, వాచ్‌మెన్‌లు, పారిశుద్ధ్య కార్మికులకు రూ.2వేల నుంచి రూ.6 వేలకు పెంచారని పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే ఇప్పించడంతో పాటు ప్రతినెలా వారికి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.